ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3


శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

సోమవారం 6 అక్టోబరు 2025

ఖాకీలపై ఓ కన్నేశారా..?

- పనిదొంగల పని పట్టేందుకేనా?
- ఫెవికాల్ వీరుల్లో వణుకు
- ప్రత్యేక కమిటీ వేసిన ఎస్పీ!
- మూడు రోజుల్లో జిల్లా బాస్ చేతికి నివేదిక



రహస్యంగా వివరాలు | పాతుకుపోయిన వారి జాబితా సిద్ధం

ఖాకీలు సక్రమంగా పనిచేస్తున్నారా..?
సాకులు చెప్పి.. తప్పించుకుంటున్నారా..?
ఎన్నేళ్లుగా అక్కడే ఉంటున్నారు..?
ఎంత మాత్రం వెనకేశారు?
అసాంఘిక శక్తులతో చేతులు కలిపారా?
వారికి సహకారం అందిస్తున్నారా?

అని.. కొత్త పోలీసు బాస్ ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు ఏకంగా ఓ కమిటీ వేసి.. రహస్యంగా విచారణ చేయించినట్లు సమాచారం. ఇప్పటికే పని దాదాపు పూర్తి చేసిన ఆ కమిటీ రెండు, మూడు రోజుల్లో పోలీసు బాస్ చేతికి.. నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అందులో ఎవరెవరి పేర్లున్నాయోనని పోలీసులు వణికిపోతున్నారు. కొత్త బాస్ చర్యలతో హడలిపోతున్నారు.

హిందూపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని పోలీసు స్టేషన్లలో కొంతమంది సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు. మరికొంతమందైతే కొన్ని సబ్ డివిజన్లలో ఖాకీ డ్రస్సు ధరించినప్పటి నుంచి ఏఎస్ఐ ఉద్యోగోన్నతి వచ్చేవరకు అక్కడే పనిచేస్తూ బంధాలు భద్రం చేసుకున్నారు. దీంతో కొన్నిచోట్ల పలువురు సిబ్బంది.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో చేతులు కలిపి నేరస్తులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాంటివారి పనిపట్టేందుకు నూతనంగా జిల్లాకు వచ్చిన ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం కొంతమంది పోలీసు అధికారులతో కమిటీ కూడా వేశారు. ఈ కమిటీ రెండు, మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో ఉన్న సిబ్బంది, వారు ఆ సబ్‌డివిజన్‌లో ఎన్నేళ్లుగా పనిచేస్తున్నారు తదితర వివరాలు సిద్ధం చేసి, జిల్లా బాస్ చేతికి అందజేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిస్థితుల్లో కొంతమంది పోలీసుల వెన్నులో వణుకు పుడుతోంది. ఎస్పీ పనిదొంగల పని పడతారని కొన్ని సందర్భాల్లో గట్టిగా చెప్పారు. దీంతో ఇప్పటి వరకు అసాంఘిక శక్తులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన సిబ్బందిలో ఆందోళన మొదలైంది.

ఎన్నేళ్లుగా ఉంటున్నారో?

జిల్లాలో పాత సబ్‌డివిజన్ల వారీగా కానిస్టేబుల్‌తో మొదలుకుని ఏఎస్ఐ వరకు ఎన్నేళ్లు ఒకే డివిజన్‌లో పనిచేశారు, వారు ఐదేళ్లా, పదేళ్లా, 15ఏళ్లా అనే వివరాలు వేర్వేరుగా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. కొంతమంది సిబ్బందికి సంబంధించిన ఆర్థికపరమైన అంశాలు సైతం ఎస్పీ ఆరా తీసినట్లు తెలిసింది. వచ్చినపుడు ఎలా ఉన్నారు, ప్రస్తుతం వారి పరిస్థితిపై కూడా కన్నేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో పలు సబ్‌డివిజన్లలో అధికశాతం మంది సిబ్బంది పది నుంచి 20 ఏళ్లపాటు ఉన్నట్లు సమాచారం.

వారి పని పడతారా?

జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ దృష్టికి కొన్ని సబ్‌డివిజన్లలో సిబ్బందిలేరనీ, దీంతో నేరాలు అరికట్టలేకపోతున్నామని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు చెప్పినట్లు సమాచారం. సిబ్బంది మాత్రం ఉన్నా పనిచేయడంలో సంఖ్య తగ్గిపోతోంది. ఇందుకు కారణం ఏంటని ఎస్పీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొంతమంది సబ్‌డివిజన్ అధికారుల వద్ద పనిచేయకుండా ఐదారుగురిని కార్యాలయంలో పెట్టుకుని, వారు ఖాకీ దుస్తులు వేయకుండా పనికి తప్పించుకుంటున్నారు. అలాంటి సబ్‌డివిజన్‌లో అధికారుల సంఖ్యపై ఆరాతీసినట్లు తెలిసింది. మరికొంతమంది పోలీసు అధికారుల వద్ద మెప్పుకోసం పనిచేస్తూ పోలీసు విధులను గాలికి వదిలేస్తున్నారు. అలాంటివారిని ప్రక్షాళన చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఉన్న సిబ్బందిలో సగం మంది ఉద్యోగాలు చేయకుండా పైపైనే అధికారుల వద్ద మాటలు చెబుతూ తప్పించుకుంటున్నట్లు గుర్తించారు. అలాంటివారిని ఆ సబ్ డివిజన్ నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని కూడా ఎస్పీ ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

జాబితా సిద్ధం!

జిల్లాలో గత ఐదేళ్లలో నేరాలు చేసిన కొందరు మళ్లీ మళ్లీ చేస్తున్నారు. అందుకు కారణాలు ఏమిటి, ముఖ్యంగా పోలీసు సిబ్బంది సహకారం ఉందా? ఒకవేళ లేకపోతే నేరస్థులు తప్పుపై తప్పు ఎలా చేస్తారని ఎస్పీ భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు జరిగిన కొన్ని ముఖ్యమైన ఘటనల్లో పోలీసుల పాత్రపై లోతుగా ఆరాతీశారు. వారు ప్రస్తుతం ఏ స్టేషన్‌లో పనిచేస్తున్నారు, ఇప్పటి వారి పద్ధతుల్లో మార్పు వచ్చిందా? అనే వివరాలు రహస్యంగా పోలీసు నిఘా వ్యవస్థ సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఫెవికాల్ వీరుల్లో ఆందోళన మొదలైంది. కొంతమంది అనారోగ్య సమస్యలు, తల్లిదండ్రులకు బాగోలేదంటూ ఉన్నతాధికారులకు ఇప్పటి వరకు చెప్పి ఉన్న చోటే పదిలంగా ఉంటున్నారు. దీంతో అలాంటివారు ప్రస్తుత ఎస్పీ వద్ద చెప్పడానికి వీలులేకుండా అలాంటి విషయాలు సైతం నివేదికలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

ప్రత్యేక కమిటీ

జిల్లాలో నేరాలను అరికట్టాలంటే మొదట పోలీసు శాఖను ప్రక్షాళన అయినా చేయాలి, లేదంటే వారి పనితీరునైనా మెరుగు పరచాలని ఎస్పీ భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో వచ్చిన పదిరోజుల్లోనే జిల్లాలో శాఖలో ఏం జరుగుతుందో నివేదిక ఇవ్వాలని కొంతమంది పోలీసు అధికారులతో కమిటీ వేసినట్లు తెలుస్తుంది. ఆ కమిటీ.. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు కూడా తెలియకుండా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పనితీరు, వారు చేస్తున్న పనులపై ఆరాతీసి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. దీనిని రెండు, మూడు రోజుల్లో జిల్లా బాస్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. జాబితా పరిశీలించాక అసాంఘిక శక్తులతో చేతులు కలిపేవారు, దందాలు, భూపంచాయితీలు, రాజకీయ నాయకుల పేర్లు చెబుతూ పని తప్పించుకునే వారిపై బదిలీవేటు వేస్తారా, మందలించి తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పోలీసు సిబ్బందిలో ఆందోళన మాత్రం తారాస్థాయికి చేరింది.

పండుగ ఎఫెక్ట్



బాగేపల్లి టోల్‌గేట్ వద్ద భారీగా నిలిచిపోయిన బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు

చిలమత్తూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను ముగించుకుని ఆదివారం సాయంత్రం వారి వారి స్వస్థలాలకు జనం పయనమయ్యారు. దాంతో 44వ జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. దసరా పండుగ కోసం కర్ణాటకలోని బెంగళూరు తదితర నగరాల నుంచి ఏపీతోపాటు తెలంగాణకు చెందిన వారు పెద్ద సంఖ్యలో స్వస్థలాలకు వచ్చారు. కుటుంబ సభ్యులతో దసరా పండుగను ఘనంగా చేసుకుని, ఆదివారం తిరుగు పయానమయ్యారు. దీంతో జాతీయ రహదారిపై వాహన రద్దీ విపరీతమైంది. మండల సరిహద్దులోని బాగేపల్లి టోల్‌గేటు వద్ద వేలాది వాహనాలు కిలోమీటరు దూరం వరకు నిలిచిపోయాయి. ఒక్కో వాహనం టోల్‌గేటు దాటేందుకు అరగంట సమయం పట్టింది. బెంగళూరు వైపు వెళ్లే రహదారిలో వాహనాల రద్దీ విపరీతంగా ఉండింది. బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్లే రహదారి ఖాళీగా దర్శనమిచ్చింది.

వెలుగులోకి వ్యవహారాలు

శిశుగృహలో సిబ్బంది మధ్య వర్గపోరు

- కేంద్రానికి వెళ్లని ఉన్నతాధికారులు
- శిశువులకు శాపంగా ఉద్యోగుల నిర్లక్ష్యం



సిబ్బందిని విచారిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి,



శిశుగృహ కేంద్రం

శిశుమరణంపై ప్రభుత్వం

సీరియస్

- విచారణకు మంత్రి ఆదేశం

బాధాకరం : కలెక్టర్

4

అనంతపురం వైద్యం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సిబ్బంది వర్గపోరుతో శిశుగృహలో జరుగుతున్న నిర్వాకాలు వెలుగు చూస్తున్నాయి. పిల్లల బాగోగులు విస్మరించిన సిబ్బంది వారి వ్యక్తిగత అంశాలపై కొట్టుకుంటున్నారు. డ్యూటీల విషయంపై సిగపట్లు పడుతున్నారు. ఈ వ్యవహారాలు శిశుగృహలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయితే విషయం బయటకు పొక్కితే తమకు ఇబ్బందులు తప్పవన్న నెపంతో ఆ వీడియోను సంబంధిత సిబ్బందితో తొలగింపజేశారు. శిశువు మృతిపై జరుగుతున్న విచారణలో భాగంగా అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించారు. శిశువు మృతికి సంబంధించిన వీడియోలు దొరకలేదు కానీ ఇద్దరు సిబ్బంది కుమ్ములాట మాత్రం బయటపడినట్లు సమాచారం. ఆనోట ఈనోట విషయం బయటపడటంతో సంబంధిత రికార్డు అయిన వీడియోను శిశుగృహం నిర్వాహకులు డిలీట్

(మిగతా 4లో...)

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రవైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎస్పీ సతీశ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం లో మంత్రికి ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు సామరస్య వాతావరణం నెలకొల్పే దిశగా అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు.

నేడు పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌన్సెలింగ్ ద్వారానే పాఠశాలల కేటాయింపు

- ఖాళీలతో అమరావతికి విద్యాశాఖ ఐటీ సెల్
- అభ్యర్థులు ఎంతమంది ఉంటే అన్నే పోస్టులు
- ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లపై నిఘా

4

ఆ ఆఫీసులోకి వెళ్లం బాబోయ్..!

మడకశిర రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మల్బరీ సాగులో మడకశిర మొదటి స్థానంలో ఉంది. మల్బరీ సాగును ప్రోత్సహించే పట్టు పరిశ్రమ శాఖపైనే నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని, కూలే స్థితిలో ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మండలంలోని తడకలపల్లి సమీపాన ఎనిమిది ఎకరాల్లో విదేశీ పట్టుగుడ్ల (సీడ్) ఉత్పత్తి కేంద్రం ఉంది. ఇందులో పట్టుగుడ్ల ఉత్పత్తితోపాటు, వీవన్ నర్సరీ ఉంది. అందులో మల్బరీ మొక్కలను పెంచి రైతులకు అందజేస్తుంటారు. ఈ కార్యాలయంలో సెరికల్చర్ ఏడీ (సీడ్స్), టెక్నికల్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్‌తోపాటు నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. పట్టుగుడ్లు (సీడ్) ఉత్పత్తి చేసి మల్బరీ రైతులకు తక్కువ ధరకు అందజేస్తుంటారు. అలాంటి కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే నీరు అంతా కార్యాలయంలోకే చేరుతోంది. తరచూ భవనం



మూత పడిన పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రం



పెచ్చులూడిన పైకప్పు



పెచ్చులు ఊడి పడుతుండడంతో ఆందోళన చెందుతున్న సిబ్బంది

పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండడంతో అధికారులు భయాందోళన చెందుతున్నారు. దీంతో ఆఫీసు కార్యకలాపాలు బయట చెట్టు కింద చేస్తున్నారు. కార్యాలయంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని తగిన చర్యలు చేపట్టాలని మల్బరీ రైతులు కోరుతున్నారు.

చిగురిస్తున్న ఆశలు



- ఆమిద్యాల లిఫ్ట్‌కు మంత్రి మండలి గ్రీన్‌సిగ్నల్
- పనుల వేగవంతానికి నిర్ణయం
- మంత్రి కేశవ్ చొరవ పట్ల రైతుల హర్షం

ఆగిపోయిన కాలువ పనులు

ఉరవకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆమిద్యాల లిఫ్ట్ పనుల వేగవంతానికి మంత్రిమండలి ఆమోదం తెలపడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా 34వ ప్యాకేజీ, 203 కిలోమీటర్ వద్ద మండలంలోని రాకెట్ల సమీపంలో లిఫ్ట్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 109 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే ఈ లిఫ్ట్‌ను హంద్రీనీవా ఫేజ్ 2 కింద రూ.33.6 కోట్లతో నిర్మించనున్నారు. దీంతో ఉరవకొండ మండలంలోని రాకెట్లలో 2749ఎకరాలు, ఆమిద్యాలలో 3133 ఎకరాలు, కణేకల్లు మండలంలో సల్లాపురంలో 1099 ఎకరాలు, హనుమాపురంలో 8012ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. 2019లో భూసేకరణ ప్రారంభించారు. ఎకరాకు (మిగతా 4లో...)

మహిళా హోంగార్డు ఆత్మహత్యాయత్నం

4

గట్టుమిట్టాడుతున్నారు..!

పట్టు తప్పిన రీ సర్వే

- పొలం గట్టు సమస్యలు తేల్చని వైనం
- వైసీపీ హయాంలో 198 గ్రామాలకే పరిమితం
- అప్పట్లో 16,829 జాయింట్ ఎల్‌పీఎంలు
- రిజిస్ట్రేషన్లు కావు.. సబ్ డివిజన్లు చేయరు..
- 9 నెలల్లో 40 గ్రామాల్లో కూడా పూర్తికాని ప్రక్రియ
- మూడో విడతలోనైనా వేగవంతమయ్యేనా..?



రీ సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రీసర్వే పట్టు తప్పుతోంది. భూముల విషయంలో పరిష్కారం చూపాల్సిన రీ సర్వే మరింత వివాదం రేపుతోంది. కనీసం గట్టు సమస్యలు తేల్చకుండానే పెండింగ్‌లో ఉంచుతున్నారు. రీసర్వే చేసిన ప్రతి గ్రామంలో ఎంతో కొంతమంది ఇబ్బంది పడుతూనే ఉన్నారు. తేల్చలేని వాటిని జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లో ఎక్కించేస్తున్నారు. వాటిలో పడిన భూములను రిజిస్ట్రేషన్ చేయించాలంటే వీలు కావడం లేదు. కనీసం సబ్ డివిజన్ చేసుకోవడానికి కూడా కుదరడం లేదు. దీంతో సమస్యలు పరిష్కరించిన రీ సర్వే ఎందుకు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. వైసీపీ హయాంలో వందల ఎకరాల భూములు జాయింట్ ఎల్‌పీఎంలో ఉంచారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రత్యేకంగా నియమించిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ల కనుసన్నల్లోనే (మిగతా 4లో...)

కౌన్సెలింగ్ ద్వారానే
పాఠశాలల కేటాయింపు

అనంతపురంవిద్య, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఎంపికైన టీచర్లకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే పాఠశాలలు కేటాయించనున్నారు. వెబ్ కౌన్సెలింగ్ పెడితే తొలిసారి కాబట్టి ప్లేస్‌లు నమోదు చేసుకోవడానికి కొత్త టీచర్లు కొంత ఇబ్బందిపడే అవకాశాలు ఉన్నాయి. దీంతో మ్యాన్యువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించాలని విద్యా శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

ఎంతమంది ఉంటే అన్ని పోస్టులే..

కొత్త టీచర్లకు ఖాళీలు(ప్లేస్‌మెంట్) చూపడంలో నిబంధనలు పెట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపికైన వారికంటే పోస్టులు ఎక్కువ ఖాళీ ఉన్నాయి. అయితే కౌన్సెలింగ్‌లో ఆ ఖాళీలన్నీ చూపించడం లేదు. అన్ని చూపిస్తే దూర మండలాల్లో పాఠశాలల్లోని ఖాళీలు అలాగే ఉండిపోయే అవకాశం ఉంటుంది. ఇప్పటికే డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కుందిర్పి, శెట్టూరు, మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ వంటి మండలాల్లోని అనేక పాఠశాలలో టీచర్లు లేక విద్యాబోధన కుంటుపడింది. ఇపుడు ఆపాఠశాలలకు కొత్తటీచర్లను కేటాయించి విద్యాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. అందుకే ఏ సబ్జెక్టుకు ఎంతమంది డీఎస్సీ టీచర్లు ఉంటే అన్ని పోస్టులు మాత్రమే ఖాళీలు చూపిస్తున్నారు. ఈమేరకు రాష్ట్రకమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆ ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఖాళీల వివరాలను సేకరించి, నివేదికలను తీసుకొని ఆదివారం జిల్లావిద్యాశాఖ ఐటీ సెల్ సిబ్బంది రాజధాని అమరావతికి బయల్దేరి వెళ్లారు. అక్కడ రాష్ట్రవిద్యాశాఖ కార్యాలయంలో ఖాళీల వివరాలను పరిశీలించి ఏఏ పోస్టులు ఏఏ పాఠశాలలకు కేటాయించాలో రాష్ట్ర అధికారులు నిర్ణయం తీసుకొని ఆమోదం వేయ నున్నారు. ఆతర్వాత ఆఖాళీలనే కౌన్సెలింగ్ సమయంలో రాష్ట్ర కమిషనరేట్ నుంచే మ్యానువల్ కౌన్సెలింగ్ సమయంలో డిస్‌ప్లే చేయనున్నారు. ఎట్టి పరిస్థితులలోను ఖాళీలు మార్చడానికి అవకాశం లేకుండా కమిషనర్ ఈనిర్ణయం తీసుకున్నారు.

కౌన్సెలింగ్ తర్వాత మిగులు టీచర్ల సర్దుబాటు

కొత్తటీచర్ల కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగులు టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. నిబంధనల మేరకు విద్యార్థులు, టీచర్ల సంఖ్యను బట్టి మిగులు టీచర్లను గుర్తించి ఎక్కువగా ఉన్న ఆయా సబ్జెక్టు టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించనున్నారు. ఇప్పటికే మిగులు టీచర్లు ఎక్కడెక్కడ ఉన్నారో గుర్తించి జాబితా పెట్టుకోవాలని కమిషనర్ ఆదేశాలు ఇవ్వడంతో ఆమేరకు అధికారులు జిల్లాలో మిగులు టీచర్లను సబ్జెక్టుల ఆధారంగా గుర్తించి నివేదికలు సిద్ధం చేసుకున్నారు.

అకడమిక్‌పై దృష్టి

కొత్తటీచర్ల కౌన్సెలింగ్, మిగులు టీచర్ల సర్దుబాటు అయిన వెంటనే విద్యాశాఖ కమిషనర్ అకడమిక్‌పై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు నిత్యం పాఠశాలల పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కూడా రాష్ట్రశాఖ నుంచే రోజువారి పర్యవేక్షణ సమాచారం పంపి ఆయా పాఠశాలలను తనిఖీలు చేసి ఆన్‌లైన్‌లో వాటి వివరాలు నమోదుచేసి పంపాల్సి ఉంటుంది. ఎంఈఓలు కూడా టీచర్ల మాదిరిగానే ఉదయం 9గంటలకే ఎమ్మార్సీలకు వెళ్లి, అక్కడ ముఖ హాజరు వేసుకున్న తర్వాతనే పాఠశాలల తనిఖీకి వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం విధుల్లో ఉంటూ రెండు పూటలా ఎంఈఓలు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది. అలాగే హెచ్‌ఎంలు, టీచర్ల హాజరు, ఆయా పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల ప్రమాణాలపైనా తనిఖీలలో పరిశీలించనున్నారు. అవసరమైతే కమిషనర్, జేడీలు అన్నిజిల్లాలోను ఆకస్మికంగా తనిఖీలు చేయనున్నారు.

10రోజుల తర్వాత అకడమిక్‌పైనే..: ప్రసాద్‌బాబు, డీఈఓ

కొత్త టీచర్లకు శిక్షణ ముగిసేలోగానే మ్యానువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనల మేరకు పాఠశాలలు కేటాయిస్తాం. ఆతర్వాత ఇంకా టీచర్ల కొరత ఉన్న స్కూళ్లకు మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తాం, ఈప్రక్రియ పది రోజుల్లో పూర్తి అవుతుంది. అనంతరం అకడమిక్‌పై దృష్టి పెడతాం. ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్ల హాజరు, వారి పనితీరు, విద్యార్థుల ప్రమాణాలను పరిశీలిస్తాం. ఇప్పటికే ఈమేరకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

కమ్మ సంఘం అధ్యక్షుడిగా నాగన్న


ఉమ్మడి జిల్లా కమ్మ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి అనంత జిల్లా కమ్మ సంఘం నూతన అధ్యక్షుడు బాంబే డయింగ్ నాగన్న ఇతర కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడిగా బాంబే డయింగ్ నాగన్న ఎన్నికయ్యారు. నగరంలోని కమ్మభవన్‌లో ఆదివారం ఉమ్మడి అనంత జిల్లా కమ్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా మాసినేని రామయ్య, కార్యదర్శిగా పాలడుగు తిప్పయ్య, సంయుక్త కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా రామకృష్ణలను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా సరిపూటి సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్య, పెద్దప్ప, కేశన్న, కొండయ్య, సీవీ కొండయ్య, శ్రీరాములు, పవన్‌కుమార్, కౌశిక్‌లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు బాంబే డయింగ్ నాగన్న, ఇతర కార్యవర్గ సభ్యులకు పలువురు కమ్మకులస్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాంబే డయింగ్ నాగన్న మీడియాతో మాట్లాడుతూ కమ్మకుల సంఘం బలోపేతం కోసం అందరిని కలుపుకొని ముందుకు వెళతామన్నారు. కమ్మ కులస్థులకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా, అండగా ఉంటామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేద వర్గాలను ఆదుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

డీఆర్‌ఎం తనిఖీలు



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-అనంతపురం రైల్వే సెక్షన్‌ను, అనంతపురంలో జరుగుతున్న అమృత్ స్టేషన్ నిర్మాణ పనులను డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదివారం తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో అనంతపురం బయలుదేరిన డీఆర్‌ఎం రీర్ విండో ద్వారా ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. అనంతపురంలో జరుగుతున్న అమృత్ స్టేషన్ సుందరీకరణ పనుల విషయంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆపరేటింగ్, ఇంజనీరింగ్, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



కుళ్లాయప్ప (ఫైల్)

నల్లచెరువు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు చోట్ల రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ బాలకృష్ణ ఆదివారం తెలిపారు. అల్లుగుండు గ్రామానికి చెందిన కుళ్లాయప్ప(40) కొన్నేళ్ల కిందట భార్యతో విడిపోయాడు. కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.
నల్లచెరువుకు చెందిన జైదున్‌బీ(65) గ్రామ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమె కొన్ని రోజులు కుమార్తె వద్ద, మరికొన్ని రోజులు కుమారుడి వద్ద ఉంటూ కాలం వెళ్లదీసేది. కొన్ని రోజులుగా ఈమెకు మానసిక స్థితి సరిగా ఉండేది కాదు. ఈక్రమంలోనే ఆదివారం రైలుకిందపడి మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

చిగురిస్తున్న ఆశలు

(3వ పేజీ తరువాయి)

రూ.12లక్షల పరిహారాన్ని ప్రకటించారు. అయితే తర్వాత అధికారంలో ఉన్న వైసీపీ పట్టించుకోలేదు. 2023లో మాత్రం వైసీపీ నాయకులు హడావుడిగా లిఫ్ట్ పనులకు భూమి పూజ చేశారు. పరిహారం మంజూరు చేయకపోవడంతో పలువురు రైతులు అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడక్కడ పనులు చేసి, వైసీపీ నాయకులు చేతులు దులుపుకున్నారు. 5.5 కి.మీలకు గానూ 3.2కి.మీలు మాత్రమే కాలువను తవ్వారు. గత ఐదేళ్లు ఉత్తుత్తి ప్రచారంతో కాలం గడిపారనే విమర్శలు ఉన్నాయి.

రూ.55.60 కోట్లతో కొట్టాలపల్లి ఎత్తిపోతం పథకం

గత టీడీపీ పాలనలో కొట్టాలపల్లి ఎత్తిపోతం పథకాన్ని అప్పటి ప్రభుత్వం చీఫ్‌విప్ పయ్యావుల కేశవ్ మంజూరు చేయించారు. నియోజకవర్గంలో 10500ఎకరాలకు నీరందించేలా రూ.55.60కోట్లతో ఈ పథకాన్ని నిర్మించనున్నారు. అందుకు గానూ 177కి.మీ వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో వందల ఎకరాల బీళ్లు సాగులోకి రానున్నాయి.

మంత్రి పయ్యావుల చొరవ

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయగా రైతులకు ఆగిపోయిన పరిహారాన్ని అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మంత్రి కేశవ్ రైతుల ఖాతాల్లోకి జమ చేయించారు. రాకెట్ల గ్రామంలోనే సుమారుగా 60మంది రైతులకు రూ.5కోట్లకుపైగా పరిహారాన్ని మంజూరు చేయించారు. మూడు రోజుల కిందట జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఆమిద్యాల లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఆమోదం తెలిపారు. ఆమిద్యాల లిఫ్ట్ నిర్మాణం పనులు కార్యరూపం దాల్చడంలో మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మకం ఉంది



ఆమిద్యాలలిఫ్ట్ పనులు పూర్తి చేసి మా పొలాలకు సాగునీరు అందిస్తారన్న నమ్మకం ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే భూములకు పరిహారాన్ని ఇప్పించారు. 1.82ఎకరాలకు గానూ రూ.20లక్షలు పరిహారం నాకు జమ అయ్యింది. మంత్రిమండలి ఈ లిఫ్ట్‌కు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తున్నాం.

-మదమంచి నరేంద్ర, రాకెట్ల రైతు

రుణపడి ఉంటాం



వైసీపీ ప్రభుత్వం మా భూములకు పరిహారం అందించే విషయాన్ని పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలలకే మంత్రి చొరవ తీసుకుని, పరిహారాన్ని మంజూరు చేయించారు. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కాలువకు నీళ్లు రావడంతో మోటార్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నాం. లిఫ్ట్ పూర్తి అయితే ఆయకట్టు మొత్తం సాగులోకి వస్తుంది.

-సోంపల్లి ఎర్రిస్వామి, రాకెట్ల రైతు

సీఎం ఇచ్చిన మాటను నెరవేర్చారు



హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల పరిశీలనకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కొట్టాలపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారు. వైసీపీ నాయకులు సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. డిస్ట్రిబ్యూటరీకి నీళ్లు వస్తే రైతుల జీవితాలే మారి పోతాయి. కాలువలకు నీళ్లు వచ్చినప్పటి నుంచి వాణిజ్య పంటలను సాగు చేస్తున్నాం.

-బ్యాళ్ల ఈశ్వరయ్య, హోతూరు రైతు

గట్టుమిట్టాడుతున్నారు..!

(3వ పేజీ తరువాయి)

ఇదంతా జరుగుతోంది. వీటికి తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో సైతం పరిష్కారం దొరకట్లేదు. సబ్ డివిజన్, సరిహద్దుల విషయంలో రికార్డులు పక్కాగా ఉన్నా న్యాయం కావాలంటే పైసలు ముట్టజెప్పాల్సి వస్తోంది. కొందరు రీసర్వే డీటీలు, విలేజ్ సర్వేయర్లు ఈ వ్యవహారాల్లో బాగా ఆరితేరిపోయారని సమాచారం.

198 గ్రామాలకే పరిమితం

వైసీపీ హయాంలో రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా సీనియర్ అసిస్టెంట్లకు తాత్కాలిక ఉద్యోగోన్నతి కల్పించి రీసర్వే డీటీలుగా నియమించారు. వారి పరిధిలో రీసర్వే నిర్వహించారు. అప్పట్లో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ఒకరి భూమిలోని కొంతభూమి మరొకరి పేరు మీద ఎక్కించడం లాంటివి కోకొల్లలు. ఇక వందల ఎకరాలు జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారు. వైసీపీ హయాంలో జిల్లాలో 198 గ్రామాల్లో మాత్రమే రీసర్వే చేశారు. అందులో కూడా చాలా గ్రామాల్లో రీసర్వే పూర్తి కాలేదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం కూడా రీసర్వే చేయిస్తోంది. ఈఏడాది జనవరి 10 నుంచి రీ సర్వే చేపట్టారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే చేశారు. భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే చేయాలనేది నిబంధన. భూముల హద్దులు పరిష్కరించాల్సిన బాధ్యత రీసర్వే డీటీలది, విలేజ్ సర్వేయర్లదే. గత తప్పిదాలను సరిదిద్దుతారనుకుంటే మళ్లీ కొత్తగా సమస్యలు తెచ్చిపెడుతుండటం గమనార్హం. వైసీపీ హయాంలో జరిగిన తప్పిదాలను ఎంత వరకు ఈ ప్రభుత్వంలో సరిదిద్దగలరనేది ప్రశ్నార్థకంగా మారింది.

అప్పట్లో 16,829 జాయింట్ ఎల్‌పీఎంలు

గత ప్రభుత్వ హయాంలో అనేక తప్పిదాలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. వాటిలో వచ్చిన ఫిర్యాదుల్లో రైతులు అనేక సమస్యలు పేర్కొన్నారు. ప్రధానంగా 22-ఏ జాబితాలోకి అక్రమంగా ప్రజల భూములు చేర్చారనే ఫిర్యాదులొచ్చాయి. జాయింట్ ఎల్‌పీఎం కింద తమ భూములను నమోదు చేశారనే వినతులూ అందాయి. అప్పట్లో మొత్తం 1,94,596 ఎల్‌పీఎంలు నమోదు కాగా.. వాటిలో 16,829 జేఎల్‌పీఎంలు నమోదయ్యాయంటే ఎన్ని వేల ఎకరాలు ఇబ్బందుల్లో ఉన్నాయో చెప్పనవసరం లేదు.

● బుక్కరాయసముద్రం మండలం ఆకులేడులో వైసీపీ హయాంలో రీసర్వే చేశారు. సర్వే నంబరు 375లో 12 ఎకరాలు, 359/1ఏలో 28 ఎకరాలు, ఎకరాలలో అనేక తప్పిదాలు జరిగాయి. సబ్ డివిజన్ పూర్తి కాలేదు. పొలాల సరిహద్దులు కరెక్షన్ చేయలేదు. దీంతో సంబంధిత రైతులు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పరిష్కారం కావడం లేదు.

● అదే మండలం ఆకులేడులో సర్వేనెంబరు 360లో 30 ఎకరాలు, సర్వేనెంబరు 148లో 18ఎకరాలను జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారు. ఈ భూములను సంబంధిత రైతులు అమ్ముకోలేని పరిస్థితి దాపురించింది. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే జాయింట్ ఎల్‌పీఎం కింద ఉందనీ, దానిని తొలగిస్తేనే చేయగలమని చెబుతున్నారట. రీ సర్వే డీటీ, రెవెన్యూ అధికారులను అడిగితే తమకు ఆప్షన్ లేదనీ, కలెక్టర్ చేయాలంటూ సెలవిస్తున్నారట.

● కూడేరు మండలం పి.నారాయణపురానికి చెందిన రామాంజిరెడ్డికి నలుగురు సోదరులు. వీరికి అదే మండలం తిమ్మాపురం గ్రామ సర్వే నంబరు 388లో 15.60ఎకరాలు ఉంది. రీ సర్వే పూర్తయ్యాక ఎల్‌పీఎంలు కేటాయించారు. రామాంజిరెడ్డి తన భూమి మరొకరికి విక్రయించాక ఒక తిరకాసు బయటపడింది. సోదరుల సర్వే నంబర్లు ఒకరిది మరొకరికి ఇలా మార్చి ఎల్‌పీఎంలు కేటాయించారు. దీంతో తన భూమిని తన పేరుతో చేయించుకోవడానికి రామాంజిరెడ్డి నాలుగుదై నెలల పాటు కష్టపడాల్సి వచ్చింది. దీనికి తోడు సంబంధిత అధికారులకు ముడుపులూ ఇచ్చుకోక తప్పలేదు.

● గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామ పరిధి సర్వే నంబరు 37లో 4.5 ఎకరాల భూమి ఉంది. సోదరులకు చెందిన ఈ భూమి జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదైంది. రీసర్వే సమయంలో తామెవరూ లేకపోయినా జాయింట్ కింద నమోదు చేశారని ఆ కుటుంబం ఆరోపిస్తోంది. ఇప్పుడు సబ్ డివిజన్ చేయమంటే కుదరదంటున్నారు.

9 నెలల్లో 40 గ్రామాల్లో కూడా..

కూటమి అధికారంలోకి వచ్చాక జనవరిలో రీ సర్వే ప్రారంభించారు. మండలానికో గ్రామం చొప్పున 32 గ్రామాల్లో రీ సర్వే చేపట్టారు. 70శాతం పైలెట్ గ్రామాల్లో సైతం భూ సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలున్నాయి. అనంతరం రెండో విడతలో 24 గ్రామాలు రీసర్వే చేపట్టారు. వాటిలో 50 శాతం కూడా పూర్తి కాలేదు. తాజాగా శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా 24 గ్రామాల్లో మూడో విడత రీసర్వే చేపట్టనున్నారు. తొలి రెండు విడతల్లో 50 శాతానికిపైగా రీసర్వే పూర్తయిందని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని తెలుస్తోంది. సరిగా 40 గ్రామాల్లో కూడా రీసర్వే పూర్తి కాలేదనీ, పరిష్కారం కాని భూముల లెక్కలే స్పష్టం చేస్తున్నాయి.
జిల్లా కేంద్రానికి సమీపంలోని బుక్కరాయసముద్రం మండలంలో తొలుత పొడరాళ్ల గ్రామంలో చేపట్టారు. మధ్యలోనే గోవిందంపల్లిలో రీ సర్వే చేశారు. ఇక్కడా కొన్ని జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారు. ఇప్పుడు అది ఇంకా పూర్తి కాకుండానే కొత్తగా ఈనెల 3వతేదీ నుంచి చేపట్టే మూడో విడతలో దండువారిపల్లిలో చేపడుతున్నారు. విడపనకల్లు మండలం మాలాపురం, కడదరబెంచి గ్రామాల్లో వైసీపీ హయాంలో, ప్రస్తుత ప్రభుత్వంలోనూ రీసర్వే చేపట్టారు. దాదాపు 20 సర్వే నంబర్లలో అన్నదమ్ముల మధ్య పొలాల గట్టు సమస్యలు, ఒకరి సర్వేనంబరులోని భూమి, మరొకరి పేరుమీద ఎల్‌పీఎం నమోదయ్యాయి. మూడో విడత కింద మూడు డివిజన్లకూ 24 గ్రామాలే ఎంపిక చేశారంటే రీ సర్వే ఏ స్థాయిలో నడుస్తోందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో రెండో విడత సర్వే కొనసాగుతూనే ఉందని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

డీటీలు, విలేజ్ సర్వేయర్ల వసూళ్ల పర్వం

రీ సర్వే నత్తనడకన సాగుతోంది. ఈ పరిస్థితే ఇలాగే కొనసాగితే వచ్చే ఎప్పటికి పూర్తవుతుందో అర్థంకాని పరిస్థితి. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం ఒక్కో మండలంలో కనీసం నాలుగైదు గ్రామాలకు వించలేదు. ఇంకా 30కిపైగా గ్రామాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 400పైగా గ్రామాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. అందులోనూ గత వైసీపీ హయంలో చేసిన తప్పిదాలు, అక్రమాలను ఎప్పుడు పరిష్కరిస్తారో తేలని పరిస్థితి. రీ సర్వే ముసుగులో కొందరు డీటీలు, విలేజ్ సర్వేయర్లు ముడుపులు పుచ్చుకోవడంలో బాగా బిజీ అయ్యారు. సబ్ డివిజన్లు చేసే విషయంలోనూ, సరిహద్దుల కొలతల విషయంలో సరిగా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. వాటి విషయంలో పైసలిస్తేనే పనులు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. కొందరు డీటీలు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే జాయింట్ ఎల్‌పీఎంలు నమోదు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

పిల్లల గొడవ.. పెద్దల ఘర్షణ

వెంకటగిరిపాళ్యంలో ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన గోపాల్

పెనుకొండ రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు మధ్య జరిగిన చిన్న గొడవ రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసిన సంఘటన వెంకటగిరిపాళ్యంలో ఆదివారం జరిగింది. ఈ దాడిలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తమ్ముడు గోపాల్, మరో ఇద్దరు గాయపడ్డారు. గ్రామంలో శనివారం సాయంత్రం కేశవయ్య కుటుంబ సభ్యుల పిల్లలు, తుపాకుల కుటుంబానికి చెందిన పిల్లల మధ్య చిన్న గలాట జరిగింది. కేశవయ్య తమ్ముడి కుమారుడు మల్లికార్జున ఆదివారం కారులో గుట్టూరు వైపు వెళ్తుండగా తుపాకుల కుటుంబానికి చెందిన చంద్రాయుడు, ఓబులేసు, చంద్ర, అంజి కాపుకాసి గొడవకు దిగారు. ఇది తెలుసుకున్న గోపాల్ కొందరితో కలిసి అక్కడకురాగా మూకుమ్మడిగా ఆయనపై వేటకొడవళ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో గోపాల్, మల్లికార్జున, నాగేంద్ర గాయపడ్డారు. విషయం తెలుసుకున్న గోపాల్ వర్గీయులు పెద్దసంఖ్యలో కియ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని జాతీయరహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్పటికే సీఐ రాఘవన్, ఎస్‌ఐ రాజేష్ దాడిచేసిన నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో ఉంచారు. తుపాకుల కుటుంబం, కేశవయ్య కుటుంబానికి గత కొంతకాలంగా ఉన్న పాత కక్షల నేపథ్యంతోనే ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా హోంగార్డు ఆత్మహత్యాయత్నం

సెల్ఫీ వీడియో వైరల్



హోంగార్డును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గోరంట్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎముకలగుట్లపల్లి సమీపంలోని పొలాల్లో మహిళా హోంగార్డు ఆదివారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో మహిళా హోంగార్డుగా పనిచేస్తున్న ప్రియాంకాబాయి పోలీస్ క్వార్టర్స్‌లోనే కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పట్టణ శివారు ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ వద్ద పొలాల్లోకి వెళ్లి కూల్ డ్రిక్‌లో విషద్రావకం కలుపుకొని తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. గోరంట్లకు చెందిన కారు డ్రైవర్లు షైను, షఫీల వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆమె సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. వారిద్దరు తనను వేధిస్తూ, తనపైన సీఐకి చాడీలు చెప్పారని, దీంతో సీఐ శేఖర్ తనను ఏమీ అడగకుండానే క్వార్టర్స్ ఖాళీ చేయమని ఆదేశించారని చెప్పారు. ఈ సెల్ఫీ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది కొద్దిసేపట్లోనే వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న సీఐ శేఖర్ అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఘటనాస్థలానికి చేరుకుని, ఆత్మహత్యకు యత్నించిన హోంగార్డును ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వాహనంలో హిందూపురం తరలించారు. ఈవిషయమై సీఐ శేఖర్‌ను వివరణ కోరగా ఇతరులతో పరిచయం వల్ల వారు క్వార్టర్స్‌లోని ఇంటికి వచ్చి వెళ్లే వారన్నారు. హోంగార్డ్ ఇబ్బంది పెట్టడం వల్లే డ్రైవర్ షైను ఇటీవల ఆత్మహత్యకు యత్నించాడన్నారు. అలాగే దాదు అనే వ్యక్తితో పరిచయం పెట్టుకోవడం, వారు వేళకాని వేళ క్వార్టర్స్‌లో ఆమె ఇంటికి వస్తుండటంతో పరిస్థితి గమనించి క్వార్టర్స్ ఖాళీ చేయమని చెప్పినట్లు తెలిపారు.

స్పోర్ట్స్ కోటా పెంచిన ఘనత బాబుదే

బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే



పోటీలను ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 3శాతానికి పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాయక్‌నగర్‌లో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే చదువుతో పాటు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, జయకుమార్, కోశాధికారి సాంబమూర్తి, నరేష్, టీడీపీ నా యకులు గంగారాం, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.

వెలుగులోకి వ్యవహారాలు

(3వ పేజీ తరువాయి)

చేయించినట్లు చర్చ జరుగుతోంది.

నవ్విపోదురుగాక...

నగరంలో శిశుకేంద్రాన్ని 2011లో ప్రారంభించారు. 2014లో సిబ్బందిని నియమించారు. అయితే కేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో 2000 సంవత్సరంలో వీడియో దృశ్యాలు రికార్డు అయ్యాయి. తాజా ఘటనలపై రికార్డులను వెలికి తీయించేందుకు ప్రత్యేకంగా టెక్నీషియన్‌ను పిలిపించి సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేయించారు. అందులో 2000 సంవత్సరంలోని దృశ్యాలు మాత్రమే రికార్డులో ఉన్నాయని టెక్నీషియన్ గుర్తించారు. అప్పటినుంచి నేటివరకు రికార్డులను డిలీట్ చేసి ఉండవచ్చునని అనుమానాలను వ్యక్తంచేశారు. కేంద్రంలోని కారిడార్, కిచెన్, చిల్డ్రన్ లివింగ్, ఆవరణం ఇలా ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అయితే అందులో రికార్డు అయిన వీడియో రికార్డులను 2000సంవత్సరానికి మార్చినట్లు ఐడీసీఎస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పర్యవేక్షణ గాలికి..

శిశుగృహ నిర్వహణ ప్రక్రియలో సీడీఎస్ పీడీ, డీసీఎం ముఖ్యపాత్ర పోషిస్తారు. నెలలో నాలుగు రోజులు తప్పనిసరిగా వీరద్దరూ శిశుగృహను సందర్శించాలి. అక్కడి పరిస్థితులను తెలుసుకుని సమస్యలను పరిష్కరించాలి. సిబ్బంది ఎవరున్నారు, విధుల వేళలు, శిశువుల ఆహారం, సంరక్షణ ఇలా ప్రతిఅంశంపై పీడీ, డీసీఎం పర్యవేక్షణ ఉండాలని ఐసీడీఎస్ వర్గాలు చెబుతున్నాయి. అధికారులు ఎప్పుడో ఒకటి, రెండు సార్లు మాత్రమే అలావెళ్లి ఇలా వచ్చేస్తున్నారు. అయితే శిశుమరణంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించడంతో శిశుగృహను సందర్శించి, సంతకాలు పెట్టినట్లు రికార్డుల్లో తారుమారు చేయడానికి ఆ ఉన్నతాధికారులు యత్నిస్తున్నట్లు ఐసీడీఎస్ వర్గాల సమాచారం.

ఏడుగురు సిబ్బంది

కేంద్రం నిర్వహణలో మేనేజర్ కేంద్రబిందువు. ఉన్నతాధికారులను, సిబ్బందిని సమన్వయం చేస్తూ శిశువుల ఆరోగ్య, సంరక్షణ సజావుగా సాగేలా వ్యవహరించాలి. ప్రస్తుత మేనేజర్ వర్గపోరును సృష్టించడం, తగువులు రాజేయడం, వివాదాలకు కేంద్రంగా మార్చడంలో ఆరితేరినట్లు ఐసీడీఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. శిశుగృహలో ఒకరి చొప్పున మేనేజర్, నర్స్, వర్కర్, వాచ్‌మెన్‌పాటు నలుగురు ఆయాలు మొత్తం ఏడుగురు పనిచేస్తున్నారు.

త్రీమెన్ కమిటీతో నిజాలు నిగ్గు తేలేనా?

శిశువు మృతి ఘటనపై ఏర్పాటుచేసిన త్రిమెన్ కమిటీ నిజాలను నిగ్గుతేలుస్తుందా? కప్పిపెడుతుందా? అనే చర్చ ఐసీడీఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నిష్పక్షపాతంగా విచారణ చేపడితేనే శిశువుల సంరక్షణ కొనసాగుతుందని, లేకుంటే అభం, శుభం తెలియని చిన్నారులు మరింత మంది మృత్యువాత పడాల్సి వస్తుందని పేర్కొంటున్నాయి.

రాష్ట్ర డైరెక్టర్ రాక

శిశుమరణంపై వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ జిల్లాకు రానున్నారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కార్యదర్శి సూర్యకుమారికి వాస్తవ పరిస్థితులను వివరిచేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

శిశుమరణంపై ప్రభుత్వం సీరియస్

విచారణకు మంత్రి ఆదేశం

అనంతపురం వైద్యం/కలెక్టరేట్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శిశుగృహలో శిశువు మరణంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈఘటనపై మాతా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. సమగ్ర విచారణ జరిపి నివేదికలు పంపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆనంద్ త్రిమెన్ కమిటీనీ ఏర్పాటు చేశారు. కమిటీలోని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, పీడియాట్రిక్స్ డాక్టర్ ప్రవీణ్‌డీన్ విచారణ చేపట్టారు. శిశుగృహకు చేరుకుని సెంటర్ మేనేజర్, నర్స్, సోషల్ వర్కర్, ఆయాలు, వాచ్‌మన్‌ను వేరువేరుగా కమిటీ సభ్యులు విచారణ చేశారు. వారు చెప్పిన అంశాల ఆధారంగా నివేదిక రూపొందిస్తున్నట్లు సమాచారం. తుదినివేదిక సోమవారం వెల్లడికానుందని, ఆమేరకు చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు.

బాధాకరం

శిశుగృహలో పసికందు మృతి బాధాకరమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఈ ఘటనపై వేసిన త్రీమెన్ కమిటీ విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేస్తుందని ఆయన తెలిపారు. బాధ్యులపై తప్పక చర్యలు ఉంటాయన్నారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు.

పాడి రైతుకు ప్రోత్సాహమేదీ..?

● ప్రభుత్వ డెయిరీ మూత
● తుప్పు పడుతున్న యంత్రాలు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పాడి రైతులను పూర్తిగా విస్మరించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాడి రైతులకు ఉచిత గ్రాసం విత్తనాలతో పాటు మినీ గోకులాలను మంజూరు చేసింది. తద్వారా పాడి రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. అయితే మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ డెయిరీ మూతపడి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పునఃప్రారంభించకపోవడంతో గత్యంతరం లేక పాడి రైతులు ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో పాడి రైతులను ప్రోత్సహించకపోవడంతో పాడి పరిశ్రమ కుదేలైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మినీ గోకులం లాంటి కార్యక్రమాలు చేపట్టడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అతివృష్టి అనావృష్టితో పాటు పంటలు సాగుచేసి అప్పులు ఊబిలో రైతులు కూరుకుపోయారు. దీంతో రైతులు పాడిపరిశ్రమపై దృష్టి సారిస్తున్నారు. ఉన్న అప్పులకు తోడు మరింతఅ ప్పులు చేసిపాడిపై పెట్టుబడి పెడుతున్నారు. వారి ఇబ్బందులు గుర్తించిన కూటమి ప్రభుత్వం పాడి రైతులకు మినీ గోకులాలను మంజూరు చేసింది. వీటికి తోడు ఉచిత పశుగ్రాస విత్తనాలు అందిస్తోంది. అయితే స్థానికంగా ప్రభుత్వ డెయిరీ లేకపోడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డెయిరీ ఉన్నప్పుడు రైతులకు విరివిగా రుణాలు, ఉచిత దాణా అందజేసేవారు డెయిరీ మూతపడడంతో పాడి ఉత్పత్తి గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ డెయిరీని పునః ప్రారంభించాలని పాడి రైతులు కోరుతున్నారు.


మూతపడిన డెయిరీ


తుప్పుపట్టిన యంత్రాలు

పాడి రైతులను ప్రోత్సహించాలి



రైతుల ఇబ్బందులను గుర్తించి కూటమి పభుత్వం పాడి రైతులకు తగినప్రోత్సాహం అందించాలి. వరుసగా పంటలు లేక అప్పులు ఊబిలో కూరుకుపోతున్న రైతన్నకు పాడి పరిశ్రమే జీవనాధారం. మూతపడ్డ ప్రభుత్వ డెయిరీని తెరిపించి ఆదుకోవాలి.

-రామాంజనేయులు, నారప్పగారిపల్లి

డెయిరీని తెరిపించాలి



ప్రభుత్వ డెయిరీ ఉన్నప్పుడు పాల ఉత్పత్తితోపాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉండేవి. ఐదేళ్ల క్రితం డెయిరీ మూడపడింది. అప్పటి నుంచి ప్రైవేటు డెయిరీని రైతులు ఆశ్రయించాల్సివస్తోంది. మూతబడ్డ డెయిరీని తెరిపించాలి.

-చరణ్‌కుమార్, గాజుకుంటపల్లి

న్యూస్ బాక్స్

'పేదలకు కంటిచూపు ప్రసాదించడమే లక్ష్యం'


కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పేదలకు కంటిచూపును ప్రసాదించడమే లక్ష్యమని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలానాగేంద్ర, జయరాం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో యువర్స్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన లయన్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో 82 మందికి కంటి వైద్యులు ఆయూష్ పరీక్షలు నిర్వహించగా 40 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు దాతలు కాచెర్ల నటరాజ్, ఫౌండేషన్ కోశాధికారి వంకదారి మోహన్, క్యాంపు చైర్మన్ వైకే శ్రీనివాసులు, పీఆర్‌ఓ రాధాకృష్ణ, డాక్టర్ బీవీ సుబ్బారావు, కోటేశ్వరరావు, కేతా లోకేశ్, సీకే రామాంజనేయులు, సత్రశాల మల్లికార్జున, నాగార్జున పాల్గొన్నారు.

రేపు పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపాన రమణ మహర్షి ఆశ్రమంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఆశ్రమంలో మహాదీపం వెలిగిస్తామన్నారు. అనంతరం అక్షర మణి మాల పారాయణం ఉంటుందని, మధ్యాహ్నం 1గంటకు నారాయణ సేవ చేపడతామన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొననున్నారని ఎమ్మెల్యే వ్యక్తిగత ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తచెరువు మండలం ఇరగంపల్లిలో ఉదయం 10 గంటలకు తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. 11 గంటలకు పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణపనులకు భూమిపూజ, మధ్యాహ్నం 3 గంటలకు శిల్పారామంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్, సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్‌లతో కలసి ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

డైరెక్టర్‌కు సన్మానం


డైరెక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ అభివృద్ధి డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్‌ను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో చంద్రశేఖర్‌కు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండబోయన సతీష్ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు శంకర్, ధనుంజయ, ఉపేంద్ర పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● బీజేపీ రైతు నాయకుడు శరత్‌కుమార్‌రెడ్డి

తనకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్రపథకాలను సద్వినియోగం చేసుకుంటేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని బీజేపీ రైతు సంఘం నాయకుడు చింతా శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 100 జిల్లాలను వ్యవసాయాభివృద్ధి, అనుబంధ పరిశ్రమల స్థాపనకు ఎంపిక చేసిందన్నారు. అందులో శ్రీసత్యసాయి జిల్లా ఎంపిక కావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు పంటలు పండించడంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, గిట్టుబాటు ధర కల్పించడం తదితర విషయాల పట్ల అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతు సంఘాల ద్వారా రైతులు గిట్టుబాటు ధర కోసం ప్రయత్నాలు సాగించవచ్చని వివరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న ఎన్నోపథకాలను వివరించారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి: డీఎస్పీ


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

బత్తలపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ సూచించారు. మండలంలోని గరిశనపల్లిలో ఆదివారం రాత్రి గ్రామస్థులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మలకవేముల చెరువు పరిశీలన


చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కొత్తచెరువు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలంలోని మలకవేముల చెరువును ఏపీఎస్‌ఐడీసీ డైరెక్టర్ పత్తిచంద్రశేఖర్, మైనర్, మేజర్ ఇరిగేషన్ అధికారులు ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. డైరెక్టర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మలకవేముల చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందిస్తామని మాటలు చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టిసారించారన్నారు. అందులో భాగంగానే రూ.1.47కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామన్నారు. ఈ చెరువుకు నీరు అందిస్తే 160 ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. ఈ విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎం, ఇరిగేషన్ మంత్రి దృష్టికితీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈయన వెంట ఏపీఎస్‌ఐడీసీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత కొత్తచెరువు జట్టు


విజేత జట్టుకు నగదు అందజేస్తున్న నిర్వాహకులు

నల్లమాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నల్లమాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో నల్లమాడ యూత్ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని సిక్స్ ఏ సైడ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో 20 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిలకలగడ్డపల్లి, కొత్తచెరువు జట్లు తలపడగా కొత్తచెరువు జట్టు విజయం సాధించింది. చిలకలగడ్డపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. గెలిచిన జట్టుకు రూ.5016, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.3016 నగదును నిర్వాహకులు అందజేశారు. పలువురు మాట్లాడుతూ సిక్స్ ఏ సైడ్ క్రికెట్ పోటీలు ఇటీవలికాలంలో విశేష ఆదరణ పొందుతోందన్నారు. ఈ ఆటలో ప్రతి జట్టులో 6 మంది మాత్రమే ఉంటారన్నారు. రెగ్యులర్ క్రికెట్ కంటే తక్కువ మంది ఆటగాళ్లతో వేగవంతమైన ఆటను చూడవచ్చన్నారు. మహమ్మద్‌రఫీ, చాంప్లా నాయక్, కోట్ల మంజునాథరెడ్డి, నిర్వాహకులు అనీఫ్, హరి పాల్గొన్నారు.

8 నుంచి ఆధార్ క్యాంపులు

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట ఆర్‌పోస్టాఫీసులో జాతీయ తపాల వారోత్సవాల సందర్భంగా 8 నుంచి 14వతేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తపాలశాఖ అధికారి రాజేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు, జనాభా సంబంధిత, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్ అప్‌డేట్ సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సున్న పిల్లలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ కూడా ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో ఆదివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న బాలుడు దిలీప్‌ను గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడరు. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలును ఓ వ్యక్తి ఎక్కబోయి కాలుజారి రైలుకిందపడి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన మేరకు చిలమత్తూరు మండలం మొహరం గ్రామానికి చెందిన కమలాకర్(40) అనే వ్యక్తి హిందూపురం రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడా రైలు ఎక్కాడు. రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆగింది. కమలాకర్ వాటర్ బాటిల్ కోసం రైలు దిగాడు. ఈలోపు రైలు కదలడంతో వెళ్లిపోతుందన్న ఆత్రతతో రైలు ఎక్కేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కిందపడి అకడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటి ట్యాంకు పనులను పూర్తి చేయాలి

కదిరి అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణం 6వ వార్డు కందికుంట నారాయణమ్మ కాలనీలో నీటి ట్యాంకు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సీపీఎం అమీన్‌నగర్ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నీటి ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టిన ప్రదేశాన్ని నాయకులు వెళ్లి పరిశీలించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నీటి ట్యాంక్ నిర్మాణానికి పునాదులు తీసి మూడుఅడుగుల ఎత్తువరకు పిల్లర్లు వేశారన్నారు. ఏ కారణాల చేతనో నిర్మాణాన్ని అధికారులు ఆపేశారన్నారు. కుందికుంట నారాయణమ్మ కాలనీలో వెయ్యి కుటుంబాల వరకు నివాసాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ నీరు కాలనీలో ఉన్నా, శ్రీరామ్‌నాగర్, బాబా కాలనీ, న్యూఅమీన్ కాలనీల్లో అక్కడక్కడ పైప్‌లైన్‌లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కందికుంట, మున్సిపల్ అధికారులు స్పందించి నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణ, కాలనీవాసులు శ్రీనివాసులు, రమేష్, దివాకర్ నాయక్, మోహన్‌నాయక్, అమ్ములు, గాయత్రి, గంగాదేవి పాల్గొన్నారు.

'ప్రజాచైతన్యం కోసమే సమావేశాలు'

తనకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలలో చట్టాల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఓ గ్రామానికి వెళ్లి రాత్రిపూట సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. ముఖ్యంగా ప్రజలకు రోడ్డు భద్రత, సైబర్‌నేరాలు మహిళలు, చిన్నపిల్లల పట్ల లైంగిక వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండలంలోని గోవిందవారిపల్లిలో శనివారం రాత్రి ప్రజలతో సమావేశాన్ని నిర్వహించి వివిధ చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఆయనతో పాటు పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు


పూజల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్

సంప్రదాయాలు.. సమాజానికి బలం

● మంత్రి సత్యకుమార్ యాదవ్

బత్తలపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మానవ సమాజానికి భక్తి సంప్రదాయాలు ఎంతో బలం చేకూరుస్తాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని గంటాపురం గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారామ లక్ష్మణ అంజనేయస్వాముల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి గంటాపురం గ్రామ అల్లుడు చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్‌మోహన్ హాజరయ్యారు. మంత్రి, ఎమ్మెల్యేలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ మన సంప్రదాయలు ఆధ్యాత్మిక చైతన్యం సమాజానికి బలాన్ని చేకూరుస్తాయన్నారు. సమాజానికి శ్రీరామచంద్రుడే ఆదర్శమన్నారు. ఇలాంటి మహోత్సవాలలో గ్రామస్థులు ఏకమవడం హర్షించతగ్గ విషయమన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడిపించేది సనాతన ధర్మమే అన్నారు. ప్రస్తుతం యువత భక్తిని అలవర్చుకోవాలన్నారు. మన సనాతన ధర్మం చాలా గొప్పదని, దీన్ని అనుసరిస్తే యువత మంచి మార్గములో నడిచి క్రమశిక్షణతో మెలుగుతారన్నారు. శ్రీరాముడు మంచిపాలన అందించారని, అదే దారిలో సీఎం చంద్రబాబు పయనిస్తూ ప్రజలకు రామరాజ్యన్ని అందిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి దంపెట్ల గ్రామంలో రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం


వెంకట అభిషిక్త్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడల్లో రాణించిన ధర్మవరం పట్టణానికి చెందిన గ్రంధేశ్రీనివాసులు, సరిత దంపతుల కుమారుడు వెంకట అభిషిక్త్‌ను ఆర్యవైశ్యసంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఆదివారం జరిగిన వనవివాహారిణి కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘంసభ్యుడు వెంకట విద్యార్థి అభిషిక్త్‌ను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు జూటూరు రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది దసరా శరన్నవ రాత్రుల వేడుకల్లో భాగంగా చివరి రోజున వనవిహారిణి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులలో అధ్యాత్మికతను పెంపొందించడంతోపాటు ప్రతి ఒక్కరికి క్రీడలను నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం ఈ ఏడాది పది, ఇంటర్, క్రీడలు, ఇతర ఉన్నత చదువులలో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీని సన్మానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అంబటి సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

కదిరి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌస్‌లాజం, కార్యవర్గసభ్యులు బడా హరిప్రసాద్‌రెడ్డి, షమీవుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి ఏ ఒక్క సమస్య తీర్చలేదన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగ ఉపాధ్యాలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రెండు సంవత్సరాల పైబడి పీఆర్సీ కాలాతీతమైందన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రామాంజులు యాదవ్, లక్ష్మీప్రసాద్, జాఫర్ హుస్సేన్, యూటీఎఫ్ శ్రీనివాసులు, తాహెర్ వలి, రవివర్ధన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ 257 ఆదిబయన్న, రాజశేఖర్, రమణారెడ్డి, ఏపీటీఎఫ్ 1938 బాబా ఫక్రుద్దీన్, లక్ష్మీపతిరెడ్డి, దివాకర్, రూటా అతావుల్లా, డీటీఎఫ్ షర్ఫొద్దీన్, మౌలాలి, వైఎస్సార్‌టీఏ రఘునాథరెడ్డి, గంగాధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఘనంగా లక్ష్మీరంగనాథస్వామి రథోత్సవం





నరసాంబుధి గ్రామంలో పొరతులు మోస్తున్న మహిళలు, రథంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

అగళి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలం నరసాంబుధి గ్రామంలో ఆదివారం లక్ష్మీ రంగనాథస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పొరతులు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

అగళి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆకుపూజ, కుంకుమార్చన తదితర పూజల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

మడకశిర టౌన్/రూరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాలు మణూరు చెరువుకు చేరడంతో సోమవారం ఉదయం 10 గంటలకు జలహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆదివారం ప్రకటనలో కోరారు. హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర మండలంలోని చెరువులకు నీరు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాలువలు నిండుకుండల్లా ఉన్నాయని, త్వరలో అన్ని చెరువులకు కృష్ణా జలాలు చేరుతాయన్నారు.

రిజర్వాయర్‌కు 2,710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,670 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం వెల్లడించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.729 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సింహగిరి జట్టు



విజేత మడకశిర సింహగిరి జట్టు

మడకశిర టౌన్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఎంఎస్ఆర్-జీటీఎస్ లెదర్‌బాల్ టీ 20 క్రికెట్ పోటీల విజేతగా మడకశిర సింహగిరి జట్టు నిలిచింది. ఆదివారం ఫైనల్లో మడకశిర సింహగిరి, సోమందేపల్లి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన సింహగిరి జట్టు 19.1 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సోమందేపల్లి జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 168 పరుగులు సాధించింది. దీంతో 6 పరుగుల తేడాతో మడకశిర సింహగిరి జట్టు విజయం సాధించింది. సీఐ రాజకుమార్, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మైనార్టీ రాష్ట్ర డైరెక్టర్ ఖద్దర్, ఆదిమున్సిపాలిటీ సర్ నప్పల్ల నాగేంద్ర, వేణు, కౌన్సిలర్ తదితరులు విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ప్రాంతాల మధ్య స్నేహం పెరుగుతుందన్నారు. క్రీడల వల్ల గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు పొందవచ్చన్నారు.

ఫుట్‌బాల్‌తో శారీరక దృఢత్వం

-మున్సిపల్ చైర్మన్ రమేష్



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ శారీరక దృఢత్వానికి దోహదపడుతుందని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎంజీఎం క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ జరిగింది. ఇందులో 16జట్లు పాల్గొన్నాయి. సెమీ ఫైనల్లో హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ జట్టు ధర్మవరం జట్టుపై 2-1 స్కోర్‌తో విజయం సాధించింది. మరో సెమీఫైనల్‌లో హిందూపురం టౌన్ ఎఫ్‌సీ, కొత్తచెరువు జట్టుతో తలపడగా హిందూపురం టౌన్ ఎఫ్‌సీ జట్టు 1-0స్కోర్‌తో గెలిచి ఫైనల్‌కు చేరింది. హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్, హిందూపురం టౌన్ ఎఫ్‌సీ జట్లు తలపడగా 4-2స్కోర్‌తో హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ జట్టు విజేతగా నిలిచింది. హిందూపురం టౌన్ ఎఫ్‌సీ జట్టు రన్నర్స్ స్థానం దక్కించుకుంది. విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు లోక్‌నాథ్, కిషోర్, శేఖర్, శబరిష్, దుర్గాప్రసాద్, సలీం, విజయవాణి, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

గోరంట్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కమలాబాయి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరుగనున్న సర్వసభ్యసమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవ్వాలని కోరారు. మండల స్థాయి అధికారులు శాఖాపరమైన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

గోశాలకు పశువుల తరలింపు

హిందూపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా హిందూపురం పట్టణపరిధిలోని మోరుబాగల్ వద్ద పశువధ శాలలో ఉన్న పశువులను కళ్యాణదుర్గం గోశాలకు తరలించినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. ఒకదానికి కూడా అనుమతి లేకుండా అనధికారికంగా పదుల సంఖ్యలో పశువధశాలను నిర్వహిస్తున్నారని దీంతో కర్నాటకకు చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం దాడులు చేయగా అందులో 184 పశువులున్నాయని, ఇందులో 37 గోవులను గుర్తించామన్నారు. వీటిని వాహనాల్లో కళ్యాణదుర్గం గోశాలకు తరలించామన్నారు.

తరుచూ ప్రమాదాలు

కానరాని ప్రమాద హెచ్చరిక బోర్డులు



ప్రమాదాలు పొంచి ఉన్న కోడూరు తోపు కూడలి



కోడూరు తోపులో ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లు

చిలమత్తూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కోడూరు తోపు కూడలిలో ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. 44వ జాతీయ రహదారిలో తరుచూ వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతుండటంతో స్పీడు బ్రేకర్లు ఏర్పాటుచేశారు. అయితే అవి దూరానికి సరిగా కనపడకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు వాటిని గమనించకుండా స్పీడు బ్రేకర్లపై దూసుకెళుతున్నాయి. దీంతో వాహనాలు అతివేగంగా వచ్చి ఎగిరిపడుతున్నాయి. దీంతో వాహనాల డ్రైవర్లు కంట్రోల్ చేయలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. రెండు రోజుల క్రితం బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న లారీ స్పీడు బ్రేక్ ఉన్న చోట ముందు వెళుతున్న కారుని ఢీకొట్టింది. అదృష్ట వశాత్తు కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా, కారు పాక్షికంగా దెబ్బతినింది. ముందున్న స్పీడు బ్రేకులను గమనించకుండా వేగంగా వచ్చిన లారీని కంట్రోల్ చేయలేక డ్రైవర్ చేతులెత్తేశాడు. దీంతో ప్రమాదం జరిగింది. ప్రధానంగా స్పీడు బ్రేకులు ఉన్నట్లు తెలుసుకోవడం కోసం కొంత దూరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఇటువంటి ప్రమాదాలు జరగవని స్థానిక ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా స్పీడు బ్రేకులు ఏర్పాటుచేసిన కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు కూడలిలో స్పీడు బ్రేక్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. అదేవిధంగా కూడలిలో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి రాత్రి సమయాల్లో ప్రమాదాలను నివారించాలంటున్నారు.

అధ్వానంగా మధురేపల్లి రోడ్డు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



బురదమయంగా మారిన మధురేపల్లి రోడ్డు

చిలమత్తూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్న పాటి వర్షానికే చిత్తడై ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండలంలోని కోడూరు పంచాయతీ మధురేపల్లి గ్రామ ప్రజలు వాపోతున్నారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల విస్తరణలో భాగంగా చిన్నపరెడ్డిపల్లి నుంచి మధురేపల్లికి బీటీ రోడ్డు మంజూరు చేసింది. అయితే అంతలోగా ఎన్నికలు రావడంతో అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా పనులు ముందుకు సాగలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదే రోడ్డుకు అట్టహాసంగా భూమి పూజ చేసి త్వరలో బీటీ రోడ్డు పనులు పూర్తి చేసి గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పూర్తి చేసుకుని వెళ్లిపోయింది. అయితే ఇప్పటివరకు ఆ గ్రామానికి రోడ్డు సమస్య మాత్రం తీరలేదు. ఈ కారణంగా రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడైపోతోంది. బంకమట్టి కావడంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దాంతో కాలి నడకతో మొదలుకొని ఆటోలు, కార్లు, చివరికి ఎద్దుల బండి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారింది. వర్షం వస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మోకాలు లోతు నీళ్లు నిలబడి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమవడంతో రాకపోకలు ఎక్కువగా జరుగుతున్నాయని, అయితే రోడ్డు అధ్వాన్నంగా మారడంతో సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా రోడ్డు పనులు ప్రారంభించి బీటీ రోడ్డుని ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

250 మంది బాలురకు

ఒకే మరుగుదొడ్డి

పది ఉన్నా శిథిలావస్థకు.. పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా మరుగుదొడ్లు

పరిగి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లుగా బాలురకు మరుగుదొడ్డు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి దాకా దాదాపు 420 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో 250 మంది బాలురు ఉన్నారు. అయితే ఈ పాఠశాలకు సుమారు 4 కి.మీల దూరంలోని తిరుమలదేవరపల్లి, ఎర్రగుంట, బోరెడ్డిపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తుంటారు. వచ్చిన విద్యార్థులు అవస్థాత్తుగా బహిర్భూమికి వెళ్లాలంటే ఒకే మరుగుదొడ్డి ఉంది. దీంతో ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని స్థితిలో అవస్థలు పడుతున్నట్లు విద్యార్థులు అంటున్నారు. పది మరుగుదొడ్లున్నా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వాడుకలో ఉన్న ఒకే మరుగుదొడ్డి సైతం అపరిశుభ్రంగా దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు అంటున్నారు. బహిర్భూమికి వెళ్లాలంటే దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఇంటికి వెళ్లాలంటే దూరం కావడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నూతన మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ లక్ష్మీదేవిని వివరణ కోరగా గతంలో నాబార్డ్ నిధులు మంజూరయ్యాయని, ఆయితే పాఠశాల భవనాలకే నిధులు వచ్చాయన్నారు. నాడు-నేడు నిధులు రాకపోవడంతో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

వైన్‌షాపును మార్చండి

బహుజన చైతన్య వేదిక నిరసన

రొద్దం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహానికి వెనుక ఉన్న మద్యం షాపును మార్చాలని పెనుకొండ నియోజకవర్గ బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం రొద్దంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ అనేక మార్లు మద్యం షాపును మార్చమని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణ యజమానులకు శివరామకృష్ణ సంప్రదించగా ఐదు రోజుల్లోపు మారుస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో బాబు, గోవింద, రవికుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి గాయాలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): 44వ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఉపాధ్యాయుడు రొద్దప్ప గాయపడ్డాడు. గోరంట్ల మండలం పాతరామాపురానికి చెందిన ఉపాధ్యాయుడు రొద్దప్ప సోమందేపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ద్విచక్రవాహనంలో గుట్టూరులో తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఉపాధ్యాయుడు గాయపడ్డాడు. స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్నాకు ఏపీఎస్‌టీఏ మద్దతు

పెనుకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మంగళవారం ఫ్యాప్టో చేస్తున్న రాష్ట్రస్థాయి ధర్నాకు సంపూర్ణమద్దతు తెలియజేస్తున్నామని ఏపీఎస్‌టీఏ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మారుతిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని, పీఆర్‌సీ ఇస్తామని, మధ్యంతర భృతి ప్రకటిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇంతవరకు ఆ దిశగా అడుగులు వేయలేదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ రాక

అమరాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించే ఆర్యవైశ్యుల సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరుకానున్నట్లు మండల నాయకులు తెలిపారు. కార్యక్రమానికి సింగిల్‌విండో అధ్యక్షులు, మండలంలోని క్లస్టర్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

భూవివాదంపై ఫిర్యాదు

పావగడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భూవివాదంలో తిరుమణి పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. హొస్కేరేపురం గ్రామానికి చెందిన వెంకటరమణప్ప సర్వేనెంబరులో 60లో మూడు ఎకరాలు కొనుగోలు చేశాడు. ఆ భూమికి సంబంధించి ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేయించాలని వెంకటరమణప్ప అడగ్గా అంజనరెడ్డి, రామకృష్ణారెడ్డి తనపై దాడిచేసి దూషించారని వెంకటరమణప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దాడి, దౌర్జన్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలును ఓ వ్యక్తి ఎక్కబోయి కాలుజారి రైలుకిందపడి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన మేరకు చిలమత్తూరు మండలం మొహరం గ్రామానికి చెందిన కమలాకర్(40) అనే వ్యక్తి హిందూపురం రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడ రైలు ఎక్కాడు. రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆగింది. కమలాకర్ వాటర్ బాటిల్ కోసం రైలు దిగాడు. ఈలోపు రైలు కదలడంతో వెళ్లిపోతుందన్న ఆత్రుతతో రైలు ఎక్కేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కిందపడి ఆక్కడిక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం పూర్వాభాద్ర తిరునక్షత్రం సందర్భంగా మన్యుసూక్త హోమం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి, వేదపండితులు, అర్చకులు ఉత్సవ మూర్తికి తిరుమంజన స్నపన, మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచాలు ధరింపజేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి

మానిటరింగ్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

హిందూపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు మారుమూల ప్రాంతాల్లోనైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తెలుగు, హిందీ శిక్షణా తరగతుల్లో భాష నైపుణ్యతను వివరించారు. కార్యక్రమంలో సీఎంఓ మాలిక్, ఎంఈఓలు గంగప్ప, శేషాచలం, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

తిరుపతికి కురుబ సంఘం నాయకులు



సమావేశంలో పాల్గొన్న రొద్దం మండల కురుబ సంఘం నాయకులు

రొద్దం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన కనకదాస విగ్రహ ప్రతిష్ఠకు రొద్దం మండల కురుబ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఆదివారం తిరుపతి నడిబొడ్డున భక్తకనకదాస విగ్రహ ఆవిష్కరణ మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగింది. దీంతో మండలంలోని అనేక గ్రామాల నుంచి పెద్దఎత్తున కురుబ కులస్థులు తరలివెళ్లారు. విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సమావేశానికి హాజరయ్యారు. నియోజకవర్గ కురుబ సంఘం నాయకులు కృష్ణమూర్తి, రొద్దం మండల కురుబ సంఘం నాయకులు రామచంద్ర, మురళి, రాఘవ రామచంద్ర, అశ్వర్థనారాయణ, మనోహర్, నాగరాజు, నర్సింహారెడ్డి, వైటిరెడ్డిపల్లి రామచంద్ర తదితరులు తిరుపతికి వెళ్లిన వారిలో ఉన్నారు.

వీధికుక్కల స్వైరవిహారం

అదుపు చేయాలని విన్నవిస్తున్న స్థానికులు



గుంపుగా సంచరిస్తున్న వీధికుక్కలు

సోమందేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చికెన్, మటన్ స్టాళ్లవద్ద గుంపులుగా ఉంటున్నాయి. అలాగే వీధుల్లో వీటి సంచారం అధికం కావడంతో చిన్నారులు, పాదచారులు, వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. రాత్రివేళల్లో వీటి బెడదతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు వీటిబారిన పడుతున్నారు. అధికారం కుక్కకాటుకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. వీటిని అరికట్టడంలో పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. కుక్కలకు డీవార్మింగ్ టీకాలు అందించాలని, వీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుంటను తలపిస్తున్న రోడ్డు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సోమందేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్ చైతన్యనగర్‌లో హైవే మలుపువద్ద ఉన్న రోడ్డు కుంటను తలపిస్తోంది. అటుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు కూడా భరించలేక దోమల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం అడుగుమేర నీరు నిలుస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై నీరు నిలువకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మొబైళ్లు చోరీ

సోమందేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తన మొబైళ్లు చోరీ అయినట్లు కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌గా మహేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ఇంటిలో లేని సమయంలో ఐఫోన్, పోకో ఫోనులు చోరీకి గురయ్యాయని తెలిపాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.